
నడుముకు చుట్టుకుని నీళ్లలో దిగాడు. కొంత దూరం వెళ్లేసరికి రాకాసి సుడిగుండం సర్రున లాక్కుంది. గజేంద్రునిలా 'స్వామీ నన్ను రక్షించు. నీ సేవకే జీవితాన్ని అర్పించి రుణం తీర్చుకుంటా' అని ప్రార్థించాడు. ఒక అదృశ్య హస్తం ఒడ్డుకు చేర్చింది. అంతే, సిద్దుడు ఆ మాటే మరచిపోయాడు. శ్రీమతి తలపులతో అత్తారింటి తలుపు తట్టాడు. అనుకోని అతిథిని చూసి అంతా సంతోషించారు. అమ్మాయియైతే మరీనూ! భోజనాలయ్యాక సిద్దుడు పట్టిమంచం మీద బెట్టుగా కూర్చున్న కొత్త పెళ్లాన్ని పలకరించబోయాడు. ప్రేమగా చేతులేయబోయాడు. అంతే, ఆ పిల్ల కెవ్వుమంది. 'సన్యాసి... సన్యాసి' అనరుస్తూ దూరంగా పారిపోయింది. అప్పుడు మనవాడికి గతం గుర్తుకొచ్చింది. భార్య శ్రీకృష్ణుని ఇష్టసఖి సత్యభామలా అనిపించింది. చేతులెత్తి మొక్కి బయటికొచ్చాడు. ఇక ఇంటి మొహం చూడలేదు. అలా సిద్దుడు సిద్ధేంద్రుడయ్యాడు. అప్పటినుంచి తనే ఓ సత్యలా శ్రీకృష్ణుడిని ప్రేమించాడు. అది మధుర భక్తి! ఆ ప్రేమంతా రంగరించి రాసిందే భామా కలాపం. అందులో మూడే పాత్రలు. సత్యభామ, కృష్ణుడు, సత్య నెచ్చెలి మాధవి. మొత్తం మూడు రాత్రులు ఆడేవాడు. తొలిరోజు సత్యభామాదేవి కనిపించదు. ఆమె జడే కలాపాన్ని నడిపిస్తుంది. ఆ పాము జడకు పెద్ద కథే ఉంది. విష్ణుమూర్తి మోహిని అవతారం కోసం విశ్వకర్మ విశ్వమోహనంగా అల్లిన జడట అది. దాన్నే కృష్ణయ్య సత్యభామకు కానుకగా ఇచ్చాడు. ఆ అల్లిక వెనుకా జిగిబిగి ఉంది. ముల్లోకాలకు ప్రతీకగా మూడు కుచ్చులుంటాయా జడకి. రెండో రోజు రాత్రి సాత్రాజితి 'భామనే సత్య భామనే...' అని పాడుతూ తెరమీదికొస్తుంది.

ఆ దర్పం, ఆ జాణతనం చూడాలంటే వెంపటి వెంకటనారాయణగారు వేషం కట్టినప్పుడే చూడాలంటారందరూ! సిద్ధేంద్రుడే రంగు పూసుకుంటే, ఇంకెంత రక్తి కట్టించేవాడో! నిజమే. సాక్షాత్తు సత్యాదేవే! తానొక్కడే ఆడి మురిసిపోలేదాయన. అందం, అవయవ సౌష్ఠవం, గాత్రశుద్ధి ఉన్న యువకుల్ని ఎంచుకుని భామాకలాపంలో శిక్షణ ఇచ్చాడు. తెరకట్టి ఆడించాడు. బండి కట్టి సీమలన్నీ తిప్పాడు. ఇదంతా శ్రోత్రియులకు నచ్చలేదు. ఆటగాళ్లకు గ్రామ బహిష్కారం విధించారు. అయినా సిద్ధేంద్రుడు జంకలేదు. తన శిష్యులతో ఏకంగా ఓ గ్రామానికి పునాదులేయించాడు. అప్పటికే ఆ గుంపులోని వాళ్లంతా 'కుచేలురు'గా (అంటే, సంచార కళాకారులు) పేరు తెచ్చుకున్నారు. కావుననే ఆ ఊరు కుచేలపురి అయ్యింది. తరువాత్తరువాత కూచిపూడిగా మారింది.

కాఠిన్యం మనిషినే కాదు, కళల్నీ వదలదు. అంత గొప్ప కూచిపూడికి ఎంత కష్టమొచ్చిందో! రాజ్యాలు పోయాయి. రాజపోషకులు పోయారు. కస్తూరి కానుకలిచ్చిన రాజనర్తకుల వైభోగం పోయింది. కూచిపూడి నృత్యమంటే భరతనాట్యంలో భాగమనుకునే గడ్డు రోజులొచ్చాయి. అదో కలి, అరవై డెబ్బై సంవత్సరాలు కష్టపడ్డారు. గండాలన్నీ గట్టెక్కాయి. అగ్రహారంలోని పదహారు కుటుంబాల అడ్డాల నుంచి దిగొచ్చి అంతర్జాతీయంగా విస్తరించింది కూచిపూడి. ఆరేడు దశాబ్దాల నుంచీ మగువలూ నేర్చుకుంటున్నారు. ఈ విషయంలో వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రిగారికి చేతులెత్తి మొక్కాలి. ఆయన పుణ్యమే ఇదంతా! అప్పట్లో మహిళల్ని కూచిపూడికి దూరంగా పెట్టడానికి చాలా కారణాలున్నాయి. ప్రధానమైంది శాంతి భద్రతల సమస్య. ఇక స్వాతంత్ర్యోద్యమ సమయంలో అయితే, కూచిపూడి దేశభక్తిని చాటుకుంది. వేదాంతం పార్వతీశం నెహ్రూమీద పాటలు రాసి కేళికలు కట్టించారు. దర్భా వెంకటేశ్వర్లు 'హిట్లర్ పతనం' అనే యక్షగానాన్ని సృష్టించారు. సిమ్లా ఒప్పందానికి కుంకుడుకాయలేసి





తలంటడానికి 'సిమ్లా భాగవతం' పుట్టుకొచ్చింది. మహాత్ముడి నేతృత్వంలోని సామాజిక పునరుజ్జీవన ఉద్యమానికి సైదోడుగా 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ', 'బడి' వంటి నృత్యరూపకాలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ అవతరించాక కూచిపూడికి శాస్త్రీయ నృత్యంగా గుర్తింపు తెచ్చే ప్రయత్నం మొదలైంది. బందా కనక లింగేశ్వరరావు. విస్సా అప్పారావు, అయ్యంకి తాండవకృష్ణ వంటివారు ప్రతిచోటా ప్రదర్శనలిచ్చారు. కూచిపూడి అగ్రహారీకులకే పరిమితమైన నాట్యాన్ని నటరాజ రామకృష్ణ, కోరాడ నరసింహారావు, నరసింహాచారి, రాధారెడ్డి, రాజారెడ్డి వంటివారు నేర్చుకుని నలుగురికీ విస్తరించారు. ఇంద్రాణి రెహమాన్, యామినీ కృష్ణమూర్తి వంటి తొలితరం నృత్యకారిణులు దేశమంతా ప్రదర్శనలిచ్చి ప్రపంచాన్ని ఆకర్షించారు.

అసలు కూచిపూడి శాస్త్రీయమా, కాదా అన్న ప్రశ్నకు జాతీయ సదస్సు సరైన జవాబిచ్చింది. తొందర్లోనే శాస్త్రీయ హోదా వచ్చింది. అహ్మదాబాదుకెళ్లి మృణాళినీ సారాభాయ్ అకాడమీలో కొలువు సంపాదించిన సి.ఆర్.ఆచార్య హైదరాబాద్‌లో అకాడమీ పెట్టిన రామకోటయ్య, మద్రాసీలకు కలాపాన్ని పరిచయం చేసిన వెంపటి చిన సత్యం... ఒకరా ఇద్దరా కూచిపూడిని జగద్విఖ్యాతం చేసారు. వెంపటి చిన్నసత్యం ఓ సిలబస్‌తో విశ్వవ్యాప్తం చేసారు. కొందరు చరిత్రకెక్కారు. కొందరు అజ్ఞాతంగా మిగిలిపోయారు. తెలుగు సినిమాల్లో వేదాంతం రాఘవయ్య, వెంపటి పెద్దసత్యం, పసుమర్తి కృష్ణమూర్తి, జగన్నాథశర్మ, శైవా ప్రాచుర్యానికి తీసుకొనిరాగా, అవకాశాలొచ్చి విదేశాలకు వెళ్లినవారు అవకాశమున్న ప్రతిసారీ అక్కడివారికి కూచిపూడి గురించి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ప్రవాస సంఘాలైతే పండుగలకూ పబ్బాలకూ ఆంధ్రదేశం నుంచి కళాకారుల్ని తీసుకెళ్లి ప్రదర్శనలిప్పిస్తూనే ఉన్నారు. సిలికానాంధ్రులు అమెరికాలోని క్యూపర్టినోలో అంతర్జాతీయ కూచిపూడి సమ్మేళనం' నిర్వహించారు. దాదాపు పాతిక దేశాల నుంచి రెండున్నర వేలమంది కళాకారులు పాల్గొన్నారు. కూచిపూడి నృత్యం గిన్నీస్ రికార్డులో నమోదయింది. ●



# ప్రపంచంలోనే అధికాదాయం తెచ్చే ఆలయం కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర ఆలయం!

## స్వయంభువుడైన వేంకటేశ్వరుడెప్పుడు వెలిసిందీ తెలియదు, బ్రహ్మదేవుడు పాదాలు కడిగా బ్రహ్మోత్సవాలు చేసాడన్నది వాస్తవం!

## తెలుగు నేల తిరుపతి కొండపై కొండంత దైవం ఉండడం తెలుగువారి అదృష్టం!

ఒకప్పుడు వేలల్లో, అటుమీదట లక్షల్లో, ప్రస్తుతం కోటి రూపాయలకు పైగా, రోజూ వారీ ఆదాయం చూపిస్తున్న కోటి వెలుగుల కోనేటి రాయుడు చిత్తూరు జిల్లాలోని తిరుపతి పట్టణంలో ఏడుకొండలపై స్వయంభువుగా వెలిసి, విశ్వానికే వెలుగుల్ను ప్రసాదిస్తున్నాడు.

శ్రీవారి ఆలయం రవాణా సౌకర్యాలు లేనప్పట్నుంచీ రాజులను, చక్రవర్తులను, నవాబులను, పాదుషాలనూ, తెల్లదొరలను, ఏడు కొండలపైనున్న తన ఆలయానికి రప్పించుకుని, ఆలయ నిర్మాణం, అభివృద్ధినీ చేయించుకున్న వడ్డీకాసులవాడు. పద్మావతినిచ్చి వివాహం చేసిన ఆకాశరాజు, తొండమాన్ రాజు, శ్రీకృష్ణదేవ రాయలు వరకూ ఎందరో చక్రవర్తులు – ఆలయ నిర్మాణం అభివృద్ధికి సంకల్పించి ప్రపంచంలోనే విశిష్టమైన ఆలయంగా తీర్చిదిద్దారు. ఆదివరాహమూర్తి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి స్థలం యిస్తే, శ్రీనివాసుడు తిరుమల అంతటా విస్తరించి పోయాడు. 2, 3 ఎకరాల స్థలంలో ఆలయ నిర్మాణమే ఆక్రమించు కున్నది. 413 అడుగుల నిడివి, 263 అడుగుల వెడల్పు గల దీర్ఘ చతురస్రాకారంగా ఆలయం, 12.9 అడుగుల పొడవు, 12.9 అడుగులు విస్తీర్ణంగల గర్భాలయంతో, సముద్ర మట్టానికి రెండువేల తొమ్మిది వందల అడుగుల ఎత్తుగల ఈ ఆలయాన్ని రాచరికయుగం ముగిసేవరకూ పాలకులైన చక్రవర్తులే పోషకులూ, భక్తులూ! ఆంధ్రభోజుడైన శ్రీకృష్ణదేవరాయలు వారే సతుల సమేతంగా ఏడు పర్యాయములు వచ్చి, శ్రీవారిని దర్శించి ఎన్నో కానుకలిచ్చి, ఆభరణాలను చేయించారు. ●

**ప్రపంచ తెలుగు మహా సభలకు తిరుపతి వేదిక కావడం శుభం! ఈ ఏడు కొండలు వాణ్ణి 'రాయలు' ఏడు పర్యాయలు దర్శించిన పుణ్యభూమి.**



# శ్రీవారి పుష్పయాగ మహోత్సవం

తిరుమలలో శ్రీనివాసుని శోభను ఎంత వర్ణించినా తక్కువే! తిరుమలలో శ్రీవారికి జరిగే సేవా వైభవం వర్ణించనలవి కాదు. కొన్ని సేవలు ప్రతిదినం, కొన్ని వారానికొక్కసారి, కొన్ని మాసాలనుబట్టి, కొన్ని నక్షత్రాలననుసరించి కోనేటి రాయనికి సేవలను నిర్వహించడం అనూచానంగా వస్తోంది. ఆ దేవదేవుని అనుగ్రహానికి పాత్రులవ్వడానికి అనేక ఉత్సవాలు రంగ వైభోగంగా చేయడం భక్తకోటికి విదితమైన విషయమే! ఉత్సవాల ఘనతను ఎంత చెప్పినా తక్కువే!

శ్రీ స్వామివారి ఉత్సవ వైభవాన్ని తిలకించే యాత్రికుల ఆనందాతిశయం అనంతం. ఇలా మహోత్కృష్టమైన రీతిలో జరిపే ఉత్సవాలలో శ్రీవారి పుష్పయాగం విశేషం.

సకల లోకేశ్వరుడైన ఆ స్వామికి ఈ పుష్పయాగాన్ని వైభవముగా నిర్వహిస్తారు. ఈ పుష్పయాగాన్ని నిర్వహించడానికో ప్రత్యేక మంటపం దేవాలయంలోనే ఉంది. కార్తీక మాసంలో శ్రవణా నక్షత్రంలో తిరుమల శ్రీవారికి పుష్పయాగ మహోత్సవం అతి వైభవంగా జరుగుతుంది. పరమ వైష్ణవ మంత్ర రాజములైన షడక్షర అష్టాక్షర ద్వాదశాక్షర మంత్రాలను ఉచ్చరిస్తూ, శ్రీ మలయప్పస్వామి (శ్రీవారి ఉత్సవమూర్తి) పాదారవిందాలకు విభిన్న వర్ణాలతో విరాజిల్లే సుమాలను మనోహరంగా దోసిళ్లతో అత్యంత భక్తిపూర్వకంగా సమర్పించడం జరుగుతుంది.

"స్వామీ! ఈ సంసార జలధిలో జన్మలను నిరంతరాయంగా ధరిస్తూ భారంగా జీవితాలను వెళ్లదీస్తున్న మా హృదయ పుష్పాంజలుల వివిధ వర్ణ పుష్పాలతో జరిపే యాగాన్ని స్వీకరించి మమ్మల్ని చరితార్థులను చేయి తండ్రీ! అంటూ టన్నుల కొద్దీ పుష్పాలతో (పూజ చేయడం) యాగం వంటిదీ క్షేత్రవ్రతమే! ●




# 'బాపు-రమణ'లనే ఐదు అక్షరాలూ తెలుగు ఐశ్వర్యాన్ని పెంచి పంచాయ్!

కొంటె బొమ్మల బాపు, కొన్ని తరములసేపు, గుండెలూయలూపు ఓ కూనలమ్మా అన్నారు కవి ఆరుద్ర. 'బాపూ రమణ'లు ఆరుద్ర చివరి శ్వాస వరకూ తమ చిత్రాల్లో పాటలు వ్రాయిస్తూనే ఉండేవారు. కె.వి.మహదేవన్ సంగీత స్వరాల్ను కూరుస్తూనే ఉండేవారు.


తెలుగు అన్నది ఒక వెలుగు. ఆ వెలుగును కుంచెతోనొకరూ, కలంతోనొకరూ 'జగజ్జేయం' చేసారు. 'బాపు-రమణ'లనే అక్షరాలు! తిక్కనకు పోలికగలవానికి తీసుకురాగలం. ఎర్రన్నకు పోలికగలవానిని పేర్కొనగలం. కానీ 'బాపూ రమణ'ల కుంచెకూ, కలానికీ పోలిక తీసుకుని రాలేము. కుశలవుల వంటి కవలలు గాకపోయినా, వారిరువురూ కుశలవులకు మిన్నగా, ఏకత్వమును నిరూపించారు.

బాపు బొమ్మ వంటి పిల్ల కావాలనీ, బుడుగు, సీగాన పెసూనాంబ వంటి కలం పలుకులు కావాలనీ కోరుకొనని అభిమానులు ఉండరు. ఆ శిల్పబాణీకీ, ఆ రచనా వాణీకి వారే ఆద్యులు, ప్రతిపాద్యులు.

దామెర్ల రామారావు చిత్రాలు వన్నెకెక్కాయి. కొండపల్లాయన చిత్రాలు విరిసిన వెన్నెలయ్యాయి. అవి ఆయా కాలాలకు పరిమితమయ్యాయి. ప్రతిభావంతులుగా నిలిపాయి. కానీ 'బాపు' కుంచె గీసిన బొమ్మలకు గీతగీసి, కంచె వేసి, మించిపోయిన కుంచె లేదన్నది వాస్తవమనిపించింది. అచ్చ తెలుగుదనాన్ని అందమైన వరవడిని, పదపడిని పల్లవించిన పడుచు బాపు కుంచెలో అందం ప్రత్యేకతను సంతరించుకున్నది.

విచిత్రమేమంటే ఈ ఇద్దరూ వేర్వేరు కుటుంబాలవారు. వీరిని బాల్యంలోనే కలిపిన 'బాల' అన్నయ్య, అక్కయ్యలుత్పత్తిచేసిన ఉత్సాహ ఉత్సుకతలు గంగా యమునల్లా కలిపివేసింది. అప్పట్నుంచీ కవలవిలసత్వం కమ(రమ)ణీయ స్థాయికి ఎగసింది. రమణ వ్రాయాలి, బాపూ చిత్రంగా చూపాలన్నది బాహా(స)టంగా తెలిసిపోయింది. 'గీత' పర బ్రహ్మం అనుకున్న స్రష్ట మరొకరు, అక్షఱం పరబ్రహ్మం అనుకొన్న స్రష్ఠ మరొకరు. ఈ పరబ్రహ్మల శైలి పరాపర బ్రహ్మలకివ్వలేదు. పరాను బ్రహ్మలొచ్చినప్పటికినీ, ఈ పరబ్రహ్మ శిల్పత్వాన్ని చేరుకోలేదు, చేదుకోలేదు.

ఒండొకరు సత్తిరాజు లక్ష్మీనారాయణ 'బాపు', మరొక అక్షఱ ప్రకండుడు 'రమణ' ముళ్ళపూడి వెంకట రమణ. బ్రహ్మ ఒకరిని విడదీసినా, 'శ్రీరామరాజ్యం' చిత్రం వీరినొకటిగా వెండితెరపై చూచేసరికి నేను ఎంతటి ఆనందంతో పులకరించిపోయానో! సినిమాలు తీసిన నేను, సినీమాలు చూడడం మానేను. అలాటిది కోరి కోరి చెన్నయ్ థియేటర్లో చూసాను. బోసి నోటి రమణ, బోసి నోటి బాపూజీ నవ్వులా 'బాపు' నా కళ్ళ ముందు, ఈ వ్యాసమందు ప్రచురించిన చిత్రంలా కనిపించారు.



సహధర్మచారిణితో బాపు

ఇహ 'బాపూ' విషయానికి వద్దాం! ఈ డిసెంబర్ 15కు 79 వత్సరాల వాడయ్యాడట బాపూ!

ఆంధ్రదేశం, గోదావరీ ప్రాంతం. పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురంలో ఒక ఆరువేల నియోగి బ్రాహ్మణ కుటుంబంలో సత్తిరాజు లక్ష్మీనారాయణగా పుట్టిన వశిష్ట గోదావరీ తీరం వాడే చిత్ర, చలనచిత్ర చలువతేడు 'బాపు'.

ఇదేంవీ 'శ్రీశ్రీ' వంటి ద్వి అక్షఱ నామం కాదు. కానీ చిత్రకళ, చలనచిత్ర కళారంగంలోనూ ఒక తరహా చిత్రాలకు, చిరునామా బాపు. 1945 సం॥ములో 'ఆంధ్రపత్రిక' దినపత్రికలో కార్టూనిస్టు (కొంటె చిత్రాల) చిత్రకారుడుగా పనిచేస్తూ, చదువును కొనసాగించారు. 1955 సం॥ములో మద్రాసు విశ్వవిద్యాలయం నుంచీ న్యాయశాస్త్ర పట్టా తీసుకున్నప్పటికినీ ఆ శాఖపై దృష్టిని పెట్టలేదు. చిత్రకళపైనే దృష్టి సారించారు. 'అమ్మ మాట వినకపోతే-' అన్న ముళ్ళపూడి వెంకటరమణ రచించిన 'బాల' పత్రిక కథకు 'బాపు' బొమ్మలు గీసారు. అదే వారిరువురికీ చిత్రకారుడిగా 'బాపు'కు, రచయితగా 'రమణ'కు ఏర్పడిన తొలి బంధం. 'బాల' పత్రికా బంధం. పిల్లల పత్రికకు శ్రీకారం చుట్టిన 'బాల' పత్రిక న్యాపతి రాఘవరావు (రేడియో అన్నయ్య), న్యాపతి కామేశ్వరమ్మ (బాలల అక్కయ్య) హస్తవాసియేమో ఎందరో పిల్లలు మేధావులయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కందా మోహన్ ఐ.ఏ.ఎస్. కూడా న్యాపతి రాఘవరావు దంపతులు వేసిన బీజమే! వారికి సంతానం లేదు. అందరి పిల్లల్నీ వారి సంతానంగా చూచుకొనేవారు. వారిలో నేనూ ఒకణ్ణే! (ఒకసారి పతాక వందన సభకు నన్ను అధ్యక్షుణ్ణి చేసారు. వారి హస్తవాసియేంమో, వారు హైదరాబాద్ తరలివెళ్ళిన అనన్తరం నేను బాలల రేడియో కార్యక్రమం నిర్వహించాను. 'బాపు' చిత్రాల్లోని స్త్రీ చిత్రాల్లో తెలుగుదనం పుణ్యస్త్రీతనం, చక్రాల వంటి కళ్ళూ, చెక్కిళ్ళూ చెమ్మచెక్కలాడే కన్నెభామల్లా ఉంటారు. పురాణ సంబంధ చిత్రాల్లోనూ, పత్రికాముఖ చిత్రాల్లోనూ అదే బాణీని కొనసాగించారు. అందుకేనేమో అందమైన, తెలుగుపడుచునూ 'బాపూ బొమ్మ'లా ఉన్నావే అంటారు. కృష్ణ, విజయనిర్మల నాయకా, నాయకిలుగా నిర్మించిన 'సాక్షి' చిత్రంతో 'బాపు రమణ'ల ద్వయం, కృష్ణ విజయనిర్మలల ద్వయం దాంపత్యం పటిష్టమైంది. ఆ పటిష్ట బంధం మొన్న మొన్నటి 'శ్రీరామరాజ్యం' చిత్రం వరకూ కొనసాగింది. తెలుగు, హిందీ భాషల్లో 40 చలనచిత్రాల వరకూ పనిచేసిన బంధం 'బాపు'రమణల అనుబంధం. ఇలా ఏ ద్విబంధమూ అవిచ్ఛిన్నంగా కొనసాగలేదు. వారిరువురికీ వచ్చినన్ని అవార్డులు, ఏ ద్విబంధీకులకు రాలేదు, రాదు కూడా! కేంద్ర ప్రభుత్వ, 'పద్మశ్రీ', 'పద్మభూషణ్' బిరుదులు రాకపోవడమే కొరత అనిపిస్తుంది. ఆ కొరతను 'బాపు' తీరుస్తారేమో చూద్దాం. ఆచంద్ర తారార్కము బాపు వర్ధిల్లాలని కోరుకుందాం. ●

# తెలుగు రాజ్యరమ చెన్నయ్ విడిపోయినప్పటికినీ తెలుగు సాహితీరమ వెలుగులు చెన్నయ్ విడిపోలేదు!

## -తెలుగుల కళాసాహితీ సాంస్కృతీరంగ కాణాచి చెన్నయ్ మహానగరమే!! -

## ప్రవాసాంధ్రులంటూ చెన్నయ్ తెలుగువారిని వెలకట్టడం విజ్ఞత లేని వారి మూర్ఖత్వం!

ఒక్క సినిమారంగం వారు వెళ్ళిపోయినంత మాత్రాన చెన్నయ్ ఆంధ్రులు ప్రవాసులయ్యారా? ప్రవాసులని అర్థం తెలిసే మాట్లాడుతున్నారా? ఓ ఆంధ్ర భవనమో, ఓ తెలుగు అకాడమీయో నెలకొల్పుకునే శక్తి ఇక్కడి తెలుగువారికి లేదంటారా? ప్రభుత్వ సహాయం అవసరమా?

ఆంధ్రరాష్ట్రం రావడం కోసం ప్రాణాలనే పణంగా పెట్టి ఆత్మార్పణం చేసుకున్న పొట్టిశ్రీరాములు ఇక్కడివారే కదా! ఆయన అనుకున్నట్టు ఆయన పూర్వులూ, అనేకానేక బ్రాహ్మణ, వైశ్య, రెడ్డి నాయుళ్ళ ప్రభృతులు ఎన్నెన్ని భవంతులు కట్టారు, ఎన్నెన్ని అన్న సత్రములు కట్టారు, ఎన్నెన్ని విద్యాలయాలు కట్టారు, ఎన్నెన్ని సినిమా హాలులు, నాటక ప్రదర్శనమందిరాలు, సినిమా స్టూడియోలు కట్టారు?

అన్ని కళలకూ మూలాధారమైన స్థానం మద్రాసే. (ఇప్పటి చెన్నయ్). ఎన్నో రంగాలవారికి ప్రోత్సాహమిచ్చినదీ మహానగరమే. కళాకారులను సాహితీ వేత్తలను, పురాణేతి హాసగ్రంధాలను ఏనుగుపై అంబారీకట్టి, కృష్ణరాయలువలె సత్కారములను జరిపిన రోజులను మరిచిపోని తరం కూడా ఉన్నది. ఆనాడు ధర్మసత్రములు కట్టి వదాన్యులు విద్యాసంస్థలను కొల్పినవి. యిప్పటికినీ చెరగని చిహ్నాలుగా ఉన్నాయ్. శ్రీమంతులైన వైశ్యులతోబాటు, సిరిమంతులైన బ్రాహ్మణులు ఇక్కడే సరిసమానంగా ఉండేవారు. వావిళ్ళవారు, కాశీనాధునివారు, ఆచంటవారు, 'కేసరీ విద్యాసంస్థల కె.యన్.కేసరి , కస్తూరివారు, కౌతావారు, బులుసువారు, అయ్యగారివారు, పంచాగ్నుల సూర్యనారాయణగారు, జోస్యుల సోమయాజులుగారు, నిడమర్తివారు, మల్లాదివారు, పెద్దపెద్ద సినిమానటులు, రచయితలు, కవులు, కళాకారులు, అడ్వకేట్లు, జమీందారులు, చల్లా ఎస్టేటు శాస్త్రిగారు, ప్రకాశం పంతులు, బులుసు సాంబమూర్తి, దుర్గాబాయమ్మ, కస్తూరి నారాయణమూర్తి, కస్తూరి రంగనాయకమ్మ, ఎందరెందరో మహారాజులవలె బ్రతికారు, పరిశ్రమలను స్థాపించారు. కళా, సాహితీ రంగాలను, విద్యా విజ్ఞానరంగాలను పోషించారు. నిత్యాన్న సంతర్పణలు చేసారు. దేవాలయాలు కట్టించారు, మఠాలను పోషించారు.

సత్యం చెప్పాలంటే ఆంధ్రదేశంలోని నగరాలూ పట్టణాలు, పల్లెలు కన్నా- ఇక్కడే తెలుగు వారెక్కువ. వారిలో వైశ్యులూ, బ్రాహ్మణులూ, రెడ్లూ ఎక్కువ. 50 శాతం రోడ్లు, వీధులు, పేటలు, అగ్రహారములందు తెలుగువారే! కాంగ్రెసుపాలనలో (కామరాజు భక్తవత్సలం, వెంకట్రామన్ వరకూ) అగ్రజాతుల కేమీ ఇబ్బంది లేకపోగా దళితుల్ని సహితమూ సమాజంలోని ఉన్నత స్థానానికి తీసుకుని వచ్చారు. పొరపచ్చాలు పెరగలేదు. ద్రవిడ పార్టీల వచ్చిన తరువాత తెలుగువారికి కొంత ఇబ్బంది కలిగింది. తీవ్రవాద జనితులైన పెరియార్ వంటివారు దుమారా లేపినా, అన్నాదొరై, ఎం.జి.ఆర్, జయలలిత, మూపనార్ వంటివారు సములగా తెలుగువారిని గుర్తించారు. వారి వారి పార్టీల్లో తెలుగువారిని తోడు కలిగి ఉంటూ వచ్చారు. అయితే తెలుగు సినిమా రంగం పెద్దలు ఆస్తులు తమిళులకు అమ్ముకుని పోవడం తెలుగు కుటుంబాలు పలుచ పలుచగా అక్కడక్కడ కనిపిస్తూండడంతో ఇరుగు పొరుగు అన్యోన్యత దెబ్బతిన్నది. అక్కడ అక్కడా ఉన్నవారిలో తరచు కలుసుకొనే విధానం కరిగిపోయింది. చిత్తూరు నాగయ్య నెలకొల్పిన త్యాగబ్రహ్మగాన సభ (వాణీమహల్ ) చెయ్యి జారిన తరువాత, ఆంధ్రమహిళాసభకు తెలుగుపై అంతగా ఆసక్తిలేకపోవడం, కేసరీ సంస్థలు యాజమాన్యం తెలుగేతరం కావడం, తెలుగు మహాజనసంఘం నామమాత్రం కావడం, చెన్నపురి ఆంధ్రమహాసభ, సౌందర్యమహాలు గోఖలే హాలులు చిరునామాలు చెరుపుకోవడంతో తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలు చెట్టెక్కాయ్. చిటారికొమ్మను మిఠాయి పొట్లంలా ఉండే ఆంధ్రాక్లబ్ (ఆస్కా) (ఆంధ్రాసోషల్ అండ్ కల్చరల్ ఆసోసియేషన్) 'నేనున్నాను బాయీ' అంటూ చేతికందే మిఠాయి పొట్లంలా తెలుగు తీపిని చూపిస్తున్నది.

చెప్పరాని, చెప్పుకోలేని సత్యమేమంటే మద్రాసులోని పాలక ప్రతిపక్షపార్టీల్లోని కరుణానిధి, వైగో, విజయ్‌కాంత్, ఆర్కాటు వీరాస్వామి వంటి ప్రముఖులందరూ తెలుగువాళ్ళే! రాజకీయ కారణాలవల్ల వాళ్ళు తెలుగులని చెప్పుకోరు, తెలుగుకు ఏ సహాయమూ చేయరు. పోనీ తెలుగువాళ్ళనుంచీ లాక్కున్న మద్రాసు పట్టణంలో తెలుగు సాంస్కృతిక భవనం కోసం ఓ ఇరవై గ్రౌండ్ల స్థలాన్నైనా యివ్వరు. అన్నాదొరై, కరుణానిధి వంటి మహానాయకులు స్వయంగా వచ్చి పాల్గొన్న విక్టోరియా పబ్లిక్‌హాలు నుంచి తరిమి కొట్టారు. ప్రక్కనే లీజుకిచ్చిన స్థలంలో ఆంధ్రమహాసభ ఏర్పరచుకుంటే నిర్దాక్షిణ్యంగా దాన్ని కూల్చివేసారు. అయినా తెలుగు సంస్కృతి జీవిస్తూంది. ●

ఆంధ్రరాష్ట్ర వాసులకుగానీ, పాలకులకుగానీ, సినిమావారికిగానీ చెన్నయ్‌నగర తెలుగులు పట్టరు. ఇక్కడి తెలుగు నిర్మాతలు నిర్మించే తెలుగు సినిమాలను ప్రోత్సహించరు. ఇక్కడకో చిన్న నటునిగా వచ్చిన ఎన్టీరామారావు ఇక్కణ్ణుంచే కోట్ల కొద్దీ అభిమానుల్నీ, కోట్ల కొద్దీ ఆస్తులను హైదరాబాదు పట్టుకుని వెళ్ళి అంతులేని ప్రజాభిమానం తెలుగుదేశం పార్టీకి బలం కూర్చి, ముఖ్యమంత్రియై, అక్కడికి వెళ్ళిన సినిమావారి మాటలకు చెవియొగ్గి, చెన్నై మహానగరంలో తీసిన చిత్రాలపై 23శాతం వరకూ వినోదపు పన్నువేసి, ఈ చిన్న సన్నకారు తెలుగు నిర్మాతల చిత్రాలను విడుదలయ్యే పరిస్థితులు లేకుండా కల్పించాడు.

అయితే బి.నాగిరెడ్డి వంటి నిర్మాతగానీ, బి.యన్.రెడ్డి, కె.వి.రెడ్డి, ఆదుర్తి, పి.పుల్లయ్య వంటి దర్శకులను, నాగయ్య, సి.హెచ్.నారాయణరావు, రఘురామయ్య, ఏ.నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్‌బాబు, అంజలి, ఎస్.వరలక్ష్మి, జి.వరలక్ష్మి, శ్రీరంజని, శాంతకుమారి, జానకి, కృష్ణకుమారి, దేవిక, సరోజాదేవి, జయంతి, శారద, జమున, చంద్రకళ, హేమలత, కాంచన, రాజశ్రీ, వాణిశ్రీ , ముందుతరం భానుమతి, మాలతి, కన్నాంబ, టంగుటూరి సూర్యకుమారి వంటి వారలొక్కరినైనా అక్కడ పరిశ్రమ తయారుచేయగలిగిందా? తెలుగు తెలిసిన నాయకీమణులున్నారా? విజయ- వాహిని వంటి స్టూడియోను కట్టకలిగారా? నాగిరెడ్డి రాకతో 'ఆంధ్రహాలీవుడ్' అని పేరు తెచ్చుకున్న వాహినీ వంటి ఒక్క పెద్ద స్టూడియో కూడా లేదు. మద్రాసులో నిర్మించిన చిత్రాల స్థాయి చిత్రమొకటి నిర్మించకలిగారా? కానీ ముందుగా వెళ్ళినవారు చౌకగా భూములు పొంది స్టూడియోలు, భవనాలు కట్టుకున్నారు. రియల్ ఎస్టేటు వ్యాపారం చేసి, మిలియనీర్లయ్యారు, పాట, మాట తమదికాని వారికే కోట్లు పారితోషికం. నీయమ్మ, నీయక్క, నీయబ్బ సంభాషణల హోరు. తెలుగుదనం లేని సినిమా తెలుగుగడ్డలోనే తయారవుతోంది. రాజధానీ నగరంలోగానీ, జుబిలీహిల్స్, ఫిలిమ్‌నగర్ వంటి కళాక్షేత్రముల్లోగానీ తెలుగు వినిపించదు. తెలుగును ఖూనీ చేసే చిత్రాలే ఎక్కువ వచ్చాయ్. సినిమా చూచిన తరువాత తెలుగు సినిమాలోని ఒక్కమాటా! ఒక్కపాటా గుర్తుండదు సరికదా- పేర్లు కూడా తెలుగు పేర్లు కావు. అథవా తెలుగు పేరు పెట్టినా సారస్యంగా ఉండదు.






# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



82

## పంద్రెండవ అధ్యాయము - భక్తి యోగము

**15. యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః**
**హర్షామర్షభయోద్వేగైర్ముక్తో యస్స చ మే ప్రియః.**

**వ్యాఖ్య:-** 'లోకాన్నోద్విజతే' - సత్యమార్గమున జనువాడు ప్రపంచము యొక్క నిందాస్తుతులకు ఏ మాత్రము జంకగూడదు. నిర్భయుడై ముందుకు సాగి పోవలయును. - విగతభీః. అని యొకతూరి భగవానుడు సెలవిచ్చిన విషయమును జ్ఞాపకమునందుంచుకొనవలెను.

'హర్షామర్షభయోద్వేగైః హర్షము (సంతోషము) మంచిదే అయినను ఆవేశములకు లోనై, స్తోత్రములకు ఉప్పొంగిపోవుటయు, నిందలకు క్రుంగిపోవుటయు కూడదనియు, ఆ ప్రకారము ద్వంద్వములకు లోబడక, నిర్వికారుడై సమభావముగలిగి యుండవలెననియు తెలుపుటయే యగును.

**16. అనపేక్ష శ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః**
**సర్వారమ్భపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః**

**వ్యాఖ్య:-** 'శుచిర్దక్షః' - గీతాచార్యులు శుచిత్వమును అచటచట నొక్కి చెప్పుచున్నారు. బాహ్యాభ్యంతరముల రెండిటియందును శుద్ధత్వమును కాపాడుకొనవలెను. తన శరీరము, తన వస్త్రములు, తన పరిసరము, తన మనస్సు - అన్నియు నిర్మలముగా నుండవలెను. మురికియందున్నవారికి మురికి భావనలే గలుగుచుండును. కావున దేహమునూ నిర్మలత్వముల రెండిటిని కాపాడుకొనవలెను.

'దక్షః - బహుసమర్థతతో, సమయస్ఫూర్తితో కార్యములను, ఆధ్యాత్మిక సాధనలను నిర్వహించుకొనుచుపోవలెను - అజాగ్రత్తగనున్నచో మాయ పడగొట్టివేయగలదు.

'గత్యవ్యథః' భక్తుడగువాడు అన్నిటికిని మూలాధారమైన భగవానుని ఆశ్రయించెను గనుక ఇక నాతనికి దిగులునొందవలసిన విషయ మీప్రపంచమున ఏదియును లేదు. కావున దిగులును, దుఃఖమును దరికి జేర్చరాదు.

'సర్వారమ్భపరిత్యాగీ' - కార్యములన్నిటిని సంపూర్ణముగ పరిత్యజించువాడనగా అకర్మణ్యుడనికాదు. దైవేతరములగు సమస్తకార్యములను త్యజించువాడని, లేక సమస్తకార్యములందును కర్తృత్వబుద్ధిని విడనాడువాడనియే అర్థము. లేక కామ్యకర్మలన్నిటిని త్యజించినవాడనియు, లేక శాస్త్రనిషిద్ధములగు సమస్త కర్మములను వదలువాడనియును చెప్పుకొనవచ్చును. కార్యమునందు కర్తృత్వమును, సంగమును వదలినవాడు కార్యముచేసినను చేయనట్లేయగును. కావున అట్టివాడు సర్వకార్యపరిత్యాగియేయగును.

**17. యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాఙ్క్షతి**
**శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః**

**వ్యాఖ్య:-** 'నహృష్యతి' - ఇచట సంతోషింపడనగా ఉప్పొంగిపోడని భావము. హర్షము (సంతోషము) మంచిదే అయినను అది హర్షశోకములను ద్వంద్వములలో చేరినదిగనుకను, మనోధర్మము గనుకను, పూర్ణమనోలయమునకు, నిరంతరాత్మస్థితికి అదియు ఒకానొక అడ్డే గనుకను ఆ ప్రకారముగ చెప్పబడినది.

'శుభాశుభపరిత్యాగీ' - ఇచట పాఠకులకొక సందేహముదయించవచ్చును - లోకములో అశుభమును వదలుటగదా ధర్మము. కాని ఇచట అశుభముతోబాటు శుభమునుగూడ పరిత్యజించువాడు - అని ఏల చెప్పబడెను? గీతావాక్యములను బహుజాగ్రతగ అర్థముచేసికొనవలసియుండును. పూర్వాపరములను సమన్వయించుకొనుచు, ఏ సందర్భమున ఏ భావముతో చెప్పబడెనో గమనించుచు అర్థమును గ్రహించవలసియుండును. ఇచట భక్తి యొక్క పరాకాష్ఠస్థితి చెప్పబడుచున్నది. భక్తియొక్క చరమస్థితి, జ్ఞానస్థితి రెండును ఒకటే. పరిపూర్ణభక్తి గల మనుజుడున్ను, జ్ఞానియు ఇరువురును ఒకే దైవస్థితియందు, ఆత్మస్థితియందు నిలుకడగలిగియుందురు. అది మనస్సును, మనోవికారములను దాటిన జీవన్ముక్త స్థితి. అట్టిస్థితిలో శీతోష్ణసుఖదుఃఖ, హర్షశోక, శుభాశుభాది ద్వంద్వభావములెవ్వియు ఉండనేరవు. కేవలము దైవభావము, ఆత్మభావము ఒకటియేయుండును. కనుకనే పరిపూర్ణభక్తుడు శుభాశుభపరిత్యాగియని చెప్పబడెను. సాధకులు మొట్టమొదట శుభమును (శుభకార్యములను, శుభసంకల్పములను) గ్రహించి తద్వారా అశుభమును (అశుభకార్యములను, అశుభసంకల్పములను) త్యజించివేయవలెను. తదుపరి నిస్సంకల్పాత్మస్థితియందు, కేవలదైవస్థితియందు ఆ శుభసంకల్పాదులున్ను వానియంతటనవియే తొలగిపోయి ఒకే దైవవస్తువు మాత్రము మిగులును. శుభాశుభపరిత్యాగమను పదముయొక్క భావమిదియే. అంతియేకాని శుభకార్యములను, పుణ్యకార్యములను త్యజించివేయవలెననికాదు. సాధుకులీ విషయమును బహు జాగ్రత్తగ గమనించవలెను.

**18. సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః**
**శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సఙ్గవివర్జితః.**

**19. తుల్యనిన్దాస్తుతిర్మౌనీ సంతుష్టో యేనకేనచిత్**
**అనికేతః స్థిరమతిర్భక్తిమాన్మే ప్రియో నరః**

**వ్యాఖ్య:-** ఈ రెండు శ్లోకములందును ఐదురకములైన ద్వంద్వములు చెప్పబడినవి - (1) శత్రుమిత్రులు (2) మానావమానములు(3)శీతోష్ణములు (4) సుఖదుఃఖములు (5) నిందాస్తుతులు - అని. అవి తటస్థించినపుడు ఏ విధమైన మనోవికారమును బొందక సమస్థితియం దుండువాడని యర్థము.

'మౌనీ'-మౌనము వాక్కునకే కాదు, మనస్సునకు గూడ నుండవలెను. భక్తుడు నిరంతరము దైవమందే లగ్నమైన చిత్తము గలిగియుండును గనుక ఎవరితోను అధికముగ మాటలు పెట్టుకొనడు; లేక 'మౌనీ' శబ్దమునకు మననశీలుడని, అనగా దైవమును గూర్చి సదా మననము చేయుచుండుననియు చెప్పవచ్చును.

'అనికేతః' - నికేతము (నివాసస్థానము) లేనివాడు అనికేతుడు. అనగా ఏ సమయమున ఏనివాసము దొరకునో, దానిచే సంతుష్టినొందువాడు, లేక ఒకొచోటనున్నచో తాను నివసించు గృహాదులయెడలగాని, మఠాదులయెడలగాని మమత్వము, ఆసక్తి, సంగము లేనివాడని భావము. లేక 'నికేత' మనగా దేహమనియు చెప్పవచ్చును. అనికేతుడనగా దేహమునం దభిమానము లేనివాడు అని అర్థము.

'స్థిరమతిః' - అధ్యాత్మ (దైవ) విషయమునగాని, ప్రపంచ విషయమునగాని స్థిరమైన నిశ్చయములు గలవాడని భావము.

'భక్తమాన్' - భక్తుడెట్టి లక్షణములు గలిగియుండవలెనో ఇంతదనుక చెప్పబడినది. ఈ ముప్పదియైదు సద్గుణములతో విరాజిల్లువాడే భక్తుడని పేర్కొనబడుటవలనను, అవియన్నియు జ్ఞానియొక్క లక్షణములుగనే తోచుచుండుట చేతను వాస్తవముగ పరాభక్తికిని, జ్ఞానమునకును భేదమేలేదని తేలుచున్నది. భక్తి గలవాడు ప్రారంభస్థితియందు దేవుని పత్రపుష్పాదులతో పూజించుచుండును. కాని చిత్తము వికాసము నొందుచురాగా క్రమక్రమముగా సర్వాంతర్యామియగు ఆ యాత్మదేవుని తన మనఃపుష్పములచే పూజించును.

*(తరువాయి వచ్చే సంచికలో)*



# సీతాఫలం - రామాఫలం

## - తెలుగువారు సీతారాముల ప్రతిరూపంగా తీపిదనం గల ఫలాలు -

ఏ విటో విచిత్రం తెలియదుగానీ- సీతాఫలాలూ, రామాఫలాలూ ఆయా కాలంలోనే వస్తాయ్. అపురూపమైన రుచిగా ఉంటాయ్. పోనీ శీతాకాలంలో వచ్చినందుకు ఆ పేరుపెట్టారా- అంటే కాదేమోననిపిస్తుంది. 'శ' వర్ణ అక్షరంతో పిలవరు. సీతమ్మతల్లిలా 'సీతా-ఫలమ'నే పిలుస్తారు. ఆ కాలంలోనే ఎర్రగా బుర్రగా గుండెకాయ ఆకారంలో వచ్చే ఫలాలువస్తాయ్. ఆ ఫలానికి శ్రీరాముడు వంటి నీలమేఘశ్యామలరంగులేదు. నింగి బాగా నీలంగా ఉంటూ, క్రిందికి నీలమేఘాలతో రావడం కారణమై ఉండవచ్చు . పండులోపలి గింజలు ఒకేరక ఆకారంగానూ, ఒకేరకం తీపిగానూ ఉంటాయి. సీతాఫలం చిన్న చిన్న గొప్పులుగా ఉంటుంది. రామాఫలం తోలు పలుచగా ఉంటుంది. వీటికాలంలోనే మరోఫలం వస్తుందని అంటారు. దాన్ని 'లక్ష్మణ' ఫలమని పిలుస్తారు. నేను దాన్ని చూడలేదు. కనుక ఆ ఫలం గూర్చి చెప్పలేను. మొత్తం మీద తెలుగువారి పెదాల్లో సీతారామలక్ష్మణుల పేర్లు పల్లవించినట్లు వాళ్ళ నాలుకను సీతారామలక్ష్మణఫలాలు తీపిదనాన్ని పండిస్తున్నాయ్.

నిజానికి ఈ సీతాఫలం మనదేశానిదా అంటే కొందరు కాదంటారు. ఆఫ్రికా దేశంలో చెట్లు పెరిగి తియ్యని ఫలాలు పండే ఈ పండ్ల చెట్లను పోర్చుగీసువారు మనదేశానికి తెచ్చారంటారు. కానీ మనదేశంలో ఫలాల చెట్లలో సీతాఫలం చెట్లు కోస్తా ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల్లోనే ఎక్కువగా పండుతాయి. వినాయకచవితి సందర్భములో పాలవెల్లికీ కడతారు, నైవేద్య పళ్ళెరాల్లోనూ పెడతారు. మనకు సీతాఫలంపై అభిమానం రుచీ ఎక్కువ. పిల్లల మొదలు వృద్ధుల వరకూ చప్పరిస్తూ, తెల్లటి గుజ్జును తింటారు. కాలం మారిన కొద్దీ వీటిని సలాడ్స్‌లో ఉపయోగించుకుంటున్నారు. ఔషధపరంగా కూడా ఆకులను, బెరడులను, వేరులను కూడా వాడుకుంటున్నారు. వీటి ఆకులు మధుమేహాన్ని తగ్గిస్తాయనీ, బరువుని తగ్గిస్తాయనీ, వీటి ఆకులను నూరి కురుపులూ, సెగ్గడ్డలపై కడితే నివారణమవు తాయనీ, వీటి ఆకుల డికాషన్‌తో విరోచనాలు తగ్గించవచ్చనీ, ఆ కషాయం జలుబు కూడా తగ్గిస్తుందని కూడా వైద్య శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**పోషకాలు:** 100గ్రా. గుజ్జు నుంచి 94 క్యాలరీల శక్తి 20–25గ్రా.పిండిపదార్థాలు, 2.5గ్రా ప్రోటీన్లు, 4.4గ్రా పీచు లభ్యమవుతాయి. ఇంకా కెరోటిన్, థైమీన్, రిబోఫ్లేవిన్, నియాసిన్, విటమిన్ సి వంటి పోషకాలున్నాయి.

**రామాఫలం:** గుండ్రంగా హృదయాకారంలో ఎరుపురంగులో ఉండే ఈ పండ్ల తొక్క సీతాఫలం కన్నా నునుపుగా ఉంటుంది. దీన్ని నెట్టెడ్ కస్టర్డ్ యాపిల్, బుల్లక్ హార్ట్, బుల్‌హార్ట్ అని కూడా పిలుస్తారు. తియ్యని వాసనతో మధురమైన రుచిని కలిగి ఉండే ఈ పండు సీతాఫలంతో పోలిస్తే ఇందులో గింజలు తక్కువ. అలసిన శరీరాన్ని ఉత్తేజితం చేస్తుంది. మిగిలిన వాటితో పోలిస్తే ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. మలేరియా, క్యాన్సర్ వ్యాధులకు కారణమైన కణాలను నివారించే గుణం ఈ పండుకి ఎక్కువే!

వంద గ్రా. రామాఫలం నుంచి 75 క్యాలరీల శక్తి, 17.7గ్రా కార్బొహైడ్రేట్లు, 1.5గ్రా ప్రోటీన్లు, 3గ్రా పీచూ లభ్యమవుతాయి. మిగిలిన వాటితో పోలిస్తే ఇందులో విటమిన్ల శాతం ఎక్కువ. సి- విటమిన్‌తో పాటు బి-కాంప్లెక్స్‌లోని పైరిడాక్సిన్ ఇందులో సమృద్ధిగా ఉంటుంది. ఈ పైరిడాక్సిన్ మెదడు కణాలకు అవసరమైన రసాయనాల్ని స్థిరంగా ఉంచేందుకు దోహదపడుతుంది. నరాల వ్యాధులు, తలనొప్పి వంటివి రాకుండా చేస్తుంది.

**లక్ష్మణఫలం:** దీన్నే కొన్ని ప్రాంతాలలో హనుమాన్‌ఫలం అనీ పిలుస్తారు. లక్ష్మణఫలం కొన్ని ప్రాంతాల్లోనే లభిస్తుంది. పనసకాయలకు ఉన్నట్లుగా ముళ్లు ఉండటంతో ముళ్లసీతాఫలం అనీ అంటారు. పండిన తరవాత కాస్త పుల్లని రుచి కలిగి ఉండటంతో పుల్లని పండు అనీ అంటారు. అయితే పూర్తిగా పండిన తరవాత పైనాపిల్, స్ట్రాబెర్రీ రుచులతో కూడిన అరటిపండు రుచిని తలపిస్తుంది. గింజలు తక్కువ, గుజ్జు ఎక్కువ ఉండే ఈ పండ్లని జ్యూసులు, చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లు తయారీలో ఎక్కువగా వాడతారు. ఇవి అమెరికా దేశాల్లోనే ఎక్కువగా పండుతాయి. మనదేశంలో ఆంధ్రప్రదేశ్, కేరళ అస్సాంలలో ఇవి పండుతున్నాయి. స్థానికులు వీటి ఆకుల్నీ, గింజల్నీ కూడా అనేక రోగాల చికిత్సలో వాడుతుంటారు, ఈ చెట్టు ఆకుల నుంచి తయారుచేసిన ట్రియోమోజాన్ అనే మందును క్యాన్సర్‌కు బాగా పనిచేస్తుందని అనేకమంది నిపుణులు పరిశోధన పత్రాల్నీ రూపొందించారు. అందుకే అమెజాన్ అడవుల్లో నివసించేవాళ్లు దీన్ని మిరకిల్ ట్రీ అని పిలుస్తారు. ముఖ్యంగా పొట్టలోని నులిపురుగుల నివారణకు ఈ పండు అద్భుతంగా పనిచేస్తుందట. బెరడు, వేళ్లతోచేసే ఈ టీ తాగితే డిప్రెషన్ తగ్గుతుందనీ చెబుతారు.

**పోషకాలు:** 100గ్రా. గుజ్జునుంచి 140 క్యాలరీలశక్తి, 39గ్రా.పిండిపదార్థాలు, 7.5గ్రా పీచు, 2.5గ్రా ప్రోటీన్లూ లభిస్తాయి. విటమిన్-సి, విటమిన్ బి1,బి2, పొటాషియం కూడా ఎక్కువగా ఉంటాయి. మధురమైన రుచి... ఆ పై అద్భుత పోషకాలు... అందుకే ఈ ఫలాలు సీతా, రామలక్ష్మణ ఫలాలపేర్లతో అమృత ఫలాలయ్యాయి. ●


SOUTHERN TRAVELS
happy holidaying...
SOUTHERN TRAVELS PVT.LTD.
(Recognised by Ministry of Tourism. Govt. of India) Since 1970
18/2, Arya Samaj Road, Karol Bagh, New Delhi - 05.
Tel. : 011-4353 2800 (100 Lines), 2875 3466
Fax : 011-2875 7308, 4250 2090
e-mail : info@southerntravels.in
Winners of National Award as "The Best Domestic Tour Operator" 2 Times in a row securing 1st Position in India from the Ministry of Tourisim, Govt. of India
Book online through www.southerntravels.com
Our Tour Packages, Hotels in India & Domestic / Flight Tickets
Chennai : 044-2538 5253 Mumbai : 022 - 2501 0027
Vijayawada : 0866 - 257 6624 Vizag : 0891 - 274 5565
Bangalore : 080 - 2226 2633, Hyderabad : 040 - 2331 8866

క్రొత్త ఢిల్లీలో ఆంధ్రా హోటల్ HOTEL SOUTHERN
ఢిల్లీలోని తెలుగువారి ఏకైక వాణిజ్య సంస్థ
HOTEL SOUTHERN
style. comfort. enjoy.
ఆధునిక ప్రయాణ సౌకర్యాలతో, ఉత్తర భారత యాత్రలు నిర్వహిస్తూ ప్రతి తెలుగింటా సువరిచితమైన సదరన్ ట్రావెల్స్ వారి అనుబంధ సంస్థ "HOTEL SOUTHERN, Karol Bagh, New Delhi లోని ప్రముఖ వ్యాపార కూడలిలో, అధునాతన సౌకర్యములతో నిర్మింపబడి, 100 రూములు, Business Centre, విజయవాడ / అమరావతి రెస్టారెంట్లు గల హోటల్ సదరన్‌లో విడిది చేయగలరు.
Free pick up from Nizamuddin / New Delhi Railway Stations and Domestic Airport

# తెలుగు భాషను తియ్యగా, సులభంగా ఎలా నేర్చుకోవాలో బోధించే 'పెద్ద బాలశిక్ష'! ఎలా భాషను క్రమసరళిలో పలకాలో చెప్పే బాలవ్యాకరణం మద్రాసులోనే పుట్టాయ్!

ఒక్క 'పెద్ద బాలశిక్ష' మీవద్ద ఉంటే చాలు సకల భాషా, వ్యాకరణ, గణిత, పురాణాంశములన్నీ మీముందు ఉన్నట్లే! కానీ, నకిలీ 'బాలశిక్ష'లు వచ్చి, ఆ విజ్ఞాన సారస్వాన్ని చెడగొట్టాయ్.

ఆంగ్ల చదువులు ముదిరి పాకాన పడినప్పటికి నిన్న మొన్నటి వరకు పెద్ద బాలశిక్ష తెలియని తెలుగు విద్యార్థి ఉండరు. ఒకటిన్నర శతాబ్దం పైగా కోట్లాది తెలుగు విద్యార్థులకు అమృతహస్తం అందించిన – పెద్దబాలశిక్షను వజ్రల సీతారామ శాస్త్రి సంకలనం చేసారు. మహాభారతంలో లేని విషయాలు యెక్కడా ఉండవు. అదొక భాషా సర్వసము, నిఘంటువు. అలా 'పెద్దబాలశిక్ష' దగ్గరుంటే విశ్వవిజ్ఞానం, సమస్త భాషా విశేషాలూ తమవద్ద ఉన్నట్లేనని చెప్పాలి. బ్రౌను కొలువులో ఆయన ముఖ్య పండితులుగా ఉండేవారు. 1820లో దీనిని రచించారు. నెల్లూరువాసుడైన శాస్త్రి బ్రౌను సూచన మేరకు, బాలల మేధకు పదును పట్టేందుకు శిక్షణకై ఉపయోగపడే ప్రథమ విజ్ఞానకోశం అనదగిన బాలశిక్షను రచించారు. మొదటి బాలశిక్ష 78 పుటలలో 1847లో ప్రభాకర ముద్రాక్షర శాలలో ముద్రించబడింది. 1865లోనే రెండవ ముద్రణకు రాగా మరికొన్ని చేర్పులతో 98 పుటలతో వెలువరించారు. చెన్నపట్టణంలో శ్రీమంతులచే నిర్మించిన హిందూ




విద్యాసభలో శాస్త్రిగారు సంస్కృత పండితునిగా పనిచేసారు. ఆంధ్ర భాషాభ్యాసం చేయదలచిన బాలుర ప్రథమ శిక్షణకు ఉపయోగపడే విధంగా, నేర్పే విధంగా పుస్తకం తయరుచేయాలన్న ఆలోచనే – ఈ బాలశిక్ష. చదువు, సాహిత్యం, సంస్కృతి అనే మూడు అంశాల ప్రాధాన్యతతో – అక్షరసంఖ్య, త్రివిధ గణితము, నామావళియు, నీతి వాక్యములు, ప్రాస వాక్యములు, దృష్టాంత వాక్యములు, ద్వంద్వ వాక్యములు, లెక్కలు, కాలనిర్ణయ దినచర్య, నక్షత్ర నిర్ణయము, జ్యోతిశ్శాస్త్రము, నీతి కథలుతో బాలశిక్షను పెద్దబాలశిక్షగా ముద్రించారు. 1847 నుంచి అనేక ముద్రణలు జరుగుతూ వస్తున్న పెద్దబాలశిక్షను 1916లో వావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రులు, కుప్పలు తెప్పలుగా వస్తున్న అచ్చుతప్పులను సరిదిద్దుతూ, మొట్టమొదటి ప్రతి ఛాయలు దెబ్బతినకుండా చరిత్ర, భూగోళ విషయములు అదనంగా కూర్చి, మరింత అందమైన ప్రతిగా తీసుకువచ్చారు. ఈ బాలశిక్ష అనుకరించి అనేక పెద్దబాలశిక్ష గ్రంథాలు వెలువడ్డాయి. అయినా అవి అంతగా ప్రయోజనకరంగా లేకపోయాయి. బాలశిక్ష (1850) బాల వివేక చింతామణి అనుకరణలు సైతం పోటీ ఇవ్వలేకపోయాయి. ఆంధ్ర వచన వాఙ్మయంలో డా॥ నిడదవోలు వేంకటరావు శతాబ్దాల తరబడి పాఠశాలల్లో విద్యార్థుల చేత నియంతగా చదివిస్తుందని, ఈ బాలశిక్షను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ప్రచురించి ప్రచారంలోకి తీసుకురావాలని కోరారు. ఎట్టకేలకు తెలుగు విశ్వవిద్యాలయం దీనిని ప్రచురించినా రచయిత పేరు ఇందులో ప్రచురించకపోవటం చిత్రమైన విషయం. 1830లో ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణం అనే గ్రంథాన్ని వెలువరించారు. వ్యాకరణం గ్రంథ పరంపరలో 1951లో అనేక ముద్రణలు జరిగాయి. 1836లో తొలి తెలుగు టీక వీరిదే. అది అమరసింహ ప్రణీత నామలింగాను శాసన నింఘటువునకు తెలుగు టీక. చెన్నపురి ఫోర్టు సెంట్ కళాశాలలో వేదం వారి స్థానంలో నియమింపబడ్డారు. 1836లో రావిపాటి గురుమూర్తి శాస్త్రి మరణించగా ఆస్థానంలో వజ్జల సీతారామశాస్త్రి ప్రవేశించారు. తర్వాత 1838 నుంచి చార్లెస్ ఫిలిప్ బ్రౌనుదొర కొలువులో ముఖ్య పండితులుగా పనిచేసారు. బ్రౌను తెలుగు వ్యాకరణ రచనకు వీరు తోడ్పడ్డారు. బ్రౌను ఆదరణకు పాత్రులైనందువలన, నూతనంగా ఏర్పడ్డ రాజధాని ఉన్నత పాఠశాలలో 1841 నుండి 1843 వరకు పండిత పదవినందున్నారు. ఆంగ్ల భాషా పరిచయం తప్పనిసరి కావటంతో వారి పదవి ఊడింది, వారి స్థానంలో పరవస్తు చిన్నయసూరి చేరారు. 1836లో సరస్వతి అచ్చుకూటంను కూడా చెన్నపురిలో స్థాపించారు. బాలశిక్ష అమ్మకాలు బాగా పెరగటం వలన ముద్రణాలయం స్థాపించుకొన్నారు. 1847 నాటి ప్రతులు జిల్లాలో ఎక్కడా అందుబాటులో లేవు. 1916 నాటి ప్రతులు కూడా ఒకరిద్దరు చరిత్రకారుల వద్ద మాత్రమే పదిలంగా ఉన్నాయి అంటారు గాని, రూఢిగా తెలియదు. ●



## వావిళ్ళ వారు ముద్రించిన వాల్మీకి రామాయణం! ప్రతులను 'ఏనుగు అంబారీపై ఊరేగించారు'

ఆదికావ్యం వాల్మీకి రామాయణం. ఆది పురాణేతిహాస గ్రంథ ప్రకాశకులు వావిళ్లవారు. నెల్లూరి నుండి విచ్చేసి, తండియార్పేటలో వాసమేర్పరచుకుని, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు గారు వావిళ్ళ గ్రంథమాలను స్థాపించి, ఎన్నో పురాణేతిహాస గ్రంథాలను ముద్రించారు. పండిత పరిష్కృతంగా, తప్పొప్పు ల్లేకుండా అనేక సంస్కృతాంధ్ర గ్రంథాలను ముద్రించారు.

వారు ముద్రించిన ఆదికావ్యమైన **వాల్మీకి రామాయణం** ఆంధ్రాను వాద గ్రంథాన్ని ముద్రించి విడుదల చేసినప్పుడు – మద్రాసు పౌరులు ఆ గ్రంథాన్ని ఏనుగుపై అంబారీ కట్టి, ఆ అంబారీలో వాల్మీకి రామాయణ గ్రంథ ప్రతుల నుంచి, పుష్పమాలతో అంజలొనర్చి చెన్నపురి పురవీధులందు ఊరేగిస్తుంటే చెన్నయ్ పౌరులు ఆ గ్రంథ ప్రతులపై పుష్పాభిషేకం చేస్తూ **జైరామ్, జైరామ్** అంటూ నినాదాలు చేశారు. రామస్వామి శాస్త్రులుగారి కుమారుడు వేంకటేశ్వరశాస్త్రి 'వావిళ్ళ రామశాస్త్రులు సన్' అంటూ ప్రాచ్య పురాణ గ్రంథాలను పరంపరగా వెలువరించి తెలుగుజాతికి మహోన్నత సారస్వత చేసారు. దేశ భక్తులను పోషించారు.

# నాయకులు భగవచ్ఛింతన కలవారుగాకపోతే దేశం స్వతంత్రమైనా అభివృద్ధి చెందదు!

**- ఇస్కాన్ ఆ అభిప్రాయన్నే గాంధీకి పంపింది! -**



భగవంతుడు వెలుగువంటివాడు. అజ్ఞానం చీకటి వంటిది. విద్య నేర్పినంత మాత్రాన వాడు విజ్ఞానవంతుడు కాడు, వివేకవంతుడు కాడు. భగవంతుడున్న చోట వెలుగు ఉంటుంది, విజ్ఞానం ఉంటుంది. ఆ భగవానుడు కృష్ణుడేయని శ్రీశ్రీ ల ఏ.సి భక్తి వేదాంతస్వామి ప్రభు పాదులవారు విశ్వసించారు. విశ్వసించా రనే కన్నా ప్రతీ ఉఛ్వాస నిశ్వాసల్లోనూ ఆ కృష్ణ మంత్రమే పఠించారు. భక్తులచే పఠింపచేసారు. పరమవేదాంతులుగానూ, భక్తిపరులుగానూ, జ్ఞానపరులుగానూ తీర్చిదిద్దారు.

భగవంతుడు అనంతుడైనట్టు హరే కృష్ణా నామస్వరం దేశాలు దాటింది, సాగరాలు దాటింది. గుండ్రంగా ఉన్న ప్రపంచమంతా వ్యాపించింది. ఒక్క ప్రభుపాద ఒక్కడిగానే ఖండఖండాంతరాలు తిరిగారు.

**హరేరామ హరేరామ- రామ రామ హరేహరే**
**హరే కృష్ణ హరే కృష్ణ- కృష్ణ కృష్ణ హరే హరే**

– ఈ ఒక్క మంత్రమూ తారకమంత్రంలా ప్రపంచదేశాలన్నిటిలోనూ, ఆయా దేశజాతులన్నిటిలోనూ, ఆయాజాతులతెగలన్నిటిలోనూ, ఆయా తెగలబాషలన్నిటిలో మమేకమైపోయింది. ప్రతీ దేశంలోనూ విశ్వకర్మకట్టిన బంగారు రంగారు లోకాల్లా రాధాకృష్ణ మందిరాలు వెలిశాయ్. ఆ రాధామందిరాలందు గోశాలలు వెలిశాయ్. కృష్ణయ్య గోశాలల్లో ఆడుకున్నట్టు, కృష్ణభక్తులు గోవులను సాకుతూ శ్రీరాధాకృష్ణలకు గోపాలతోనే నివేదలను చేస్తూ, ఎరువులు, పురుగుమందులూ లేకుండా స్వచ్ఛమైన సహజమైన పంటలను పండిస్తూ, అంకితభక్తులనూ ఉద్యోగగణాన్నీ ఆరోగ్యవంతులూ, జ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతూ కృష్ణ ధర్మప్రచారం, గోసంరక్షణలో చేస్తుండబట్టే పాలకులైన రాజకీయనాయకులు చేసిన పాపాలనూ, గోవధ నేరములనుండీ ఇస్కాన్ ప్రపంచాన్ని ప్రళయాలనుంచీ సంరక్షిస్తున్నది. దేహావసరాలకూ, దేశావసారాలకూ పొంతన ఉండదనేది ఇదివరకటి మాట. స్వాతంత్ర్యానికి పూర్వంమాట.

నాయకుల తప్పుడు బాటల్లోపడి, దేశంలో ఒడిదుడుకుతనం, ఓర్వలేని తనం, చోరత్వం, క్రూరత్వం, పరస్పర దూషణలూ, దోపిడీతనం పెరిగిపోయిందంటే– అది 1947 సం॥ము తరువాతనే! ●

Beautiful City - Beautiful Hotel

DO NOT MISS
Foreverar your Serivice in the Heart of Visakhaparnam
HOTEL Daspalla
Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# గాంధీగారికి అభయ్ పంపిన లేఖ

**1947** సంవత్సరంలో భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించింది. అదునుచూచిన స్వార్ధశక్తులు రెండు దేశాలుగా చీల్చివేసారు. అప్పుడేమైనా అభివృద్ధికి దారులు వెదకటం ప్రారంభించారా అంటే లేదు హిందు ముస్లిములు మధ్య కొట్లాటలు పెరిగాయ్. భారతస్త్రీలు మానభంగానికి గురయ్యారు. లక్షలాది జనులు మరణించారు. స్వాతంత్ర్యం ఏదో నిజమైన పరిష్కారం కలిగిస్తుందని ఇస్కాన్ అభిమాని అభయ్ భావించలేదు. పరాయి పాలనలోని కష్టాలు కన్నా ఇప్పటి స్వతంత్ర్యపాలనలోనే ప్రజలెక్కువగా కష్టపడతారని అభయ్ తన దివ్యజ్ఞాన దృష్టితో గ్రహించారు. 'భగ'వద్దర్శనం పత్రికను 1944సం॥ము తరువాత ముద్రించకపోయినా భగవద్గీత ప్రామాణిక జీవితగ్రంధం. దాన్ని యధాతథంగా ప్రచురిస్తే ఇంకా జనులు పవిత్రులు భక్తులూ అవుతారని గ్రహించి, పన్నెండు వందల పుటలతో, మూడు సంపుటాల్లో ఆయనే టైప్ చేసి ముద్రించారు. కృష్ణ తత్వం బాగా ప్రచారమైంది.

భారతదేశంలో హింసావిధానం చల్లారలేదు. ముస్లిములు పాకిస్థాన్‌తో విడివడిపోయినా ఇక్కడే ఉన్న ముస్లిముల కయ్యాలు అధికంకాజొచ్చాయ్. చేసిన తప్పిదానికో, హిందూ ముస్లింముల కలహాలకు గాంధీజీ కలత చెందారు. అభయ్‌జీ గాంధీకి యదార్ధ విషయాలతో ఉత్తరం వ్రాసారు. తానొక అపరిచితుడైన మిత్రుణ్ణని వ్రాస్తూ!

మహాత్మాజీకి సమస్కారం. నేను మీ అపరిచితమిత్రుడను. నేను మీకు అనేక ఉత్తరాలను వ్రాసాను. మీ నుండి ప్రత్యుత్తరం రాలేదు. నేను రాసిన భగవద్దర్శనం పత్రికల్ని కూడా పంపాను. మీకు ఉత్తరాలు చదవడానికి తీరికలేనపుడు, ఇక మీరు పత్రికలు ఏలా చదువుతారని మీ కార్యదర్శి అన్నారు. మీతో మాట్లాడే చిన్న అవకాశమివ్వమని మీ కార్యదర్శిని ప్రార్ధించినా ఆయన బదులివ్వలేదు. మీ వంటి వానికి మంచి మిత్రుడనైన నేను బాధ్యతారహితుణ్ణి గాకూడదు. మిత్రునిగా మీకు తెలియజేసేదే మన అప్రతిష్ఠాకరమైన మృత్యువును మీరు కొనకుందురేని వెంటనే మీ రాజకీయాలకు స్వస్థి చెప్పండి. మీ ఆయుర్ధాయం పెద్దది. జీవితంలో మీరు పొందినట్టి గౌరవమర్యాదలు వేరెవ్వరికినీ రావు. కానీ ఈ గౌరవమర్యాదలు భగవన్మాయ సృష్టించిందే. శాస్త్రకోవిదుడూ, బ్రహ్మనిష్ఠుడైన ప్రామాణిక గురుదేవుని వద్ద ఆశ్రయం పొందాలని కఠోర ఉపనిషత్తు చెబుతున్నది. భగవద్గీత 4వ అధ్యాయం 34వ శ్లోకంలో జగద్గురు కృష్ణ భగవద్గీతనందు చెప్పాడు.

**తద్విది ప్రణాపాతేన పరిప్రశ్న సేవయా**
**ఉపదేక్ష్యన్తితే జ్ఞానం జ్ఞాని నాస్తత్వ దర్శినః**

–మీరిటువంటి ఉపదేశాన్ని పొందలేదని నాకు తెలుసు. సాపేక్షసత్యాలతో ప్రయోగాలు చేస్తూ, స్వప్రయోజనానికి మీరు సృష్టించిన ఏవో కఠిన తపస్సులు వేరేదీ మీరు చేయలేదు. పైన చెప్పిన విధంగా మీరు సద్గురువునాశ్రయించి ఉంటే ఆ సాపేక్ష సత్యాలన్నిటినీ త్రోసి రాజయ్యేవారే. కానీ తపస్సు ద్వారా కొన్ని దైవీ గుణాలను పొందడానికి మీరు చేసిన యత్నాలు పరతత్వసాధనకై ఉపయోగపడెడి ఉన్నతస్థాయికి మిమ్ము చేర్చగలిగినట్టివే. అట్టి తాత్కాలిక స్థితితోనే మీరు సంతప్తులైతే, పరతత్వాన్ని తెలిసికోడానికి మీరు ప్రయత్నించకపోతే, ప్రకృతి నియమానుసారం అట్టి కృత్రిమ ఉన్నత స్థానము నుండి తప్పక పతనము చెందవలసివస్తుంది అని అభయ్ నిర్భయంగా గాంధీకి వ్రాసారు.

**(భగవద్దర్శన్, జనవరి 2008 కృతజ్ఞతలు)**

# ఎప్పటికీ మరల పుట్టనివాడు! ఎన్నటికీ మరువతగనివాడు!

# బి. నాగిరెడ్డి



పిల్లల పతనాసకై పుట్టాడు! సంస్కార వంతమైన చిత్రాలు తీయడానికి పుట్టాడు. పెళ్ళి పేరంటములకై కల్యాణమండపములు కట్టాడు. ఊటీ, కొడైకెనాల్, సాతునూర్‌డాం, మైలేడీ గార్డెన్స్, బృందావనములు పోనవసరములేని సహనిర్మాతల కోసం విజయగార్డెన్స్ నిర్మించాడు. కూరగాయలు పండించి ఉద్యోగులందరికీ యిచ్చాడు. కలకత్తా, బొంబాయి, భువనేశ్వర్, తిరువనంతపురం చిత్ర నిర్మాతలందరికీ మేలైన పోస్టర్లు, కరపత్రాలు అచ్చువేసి చక్కని బి.ఎన్.కే ప్రెస్, ప్రసాద్ ప్రోసెస్ నెలకొల్పాడు. సింహళదేశంతో సహా, భారతరాష్ట్రాలల్లోని అన్ని భాషల్లోని పిల్లల్లో పఠనాసక్తి తెలివితేటలు పెరగడానికి 'చందమామ'నే క్రిందకు దింపాడు. ఫిలిమ్ ప్రాసెసింగ్, ఫిలిమ్ ప్రింటింగుకు లేబొరేటరీ, బేక్‌ప్రాజక్షన్ ఏర్పాట్లు, అందమైన పూలతోటల మధ్య రికార్డింగ్ థియేటర్లనేర్పాటు, రామానాయుడు– అక్కినేని నాగేశ్వరరావు పిల్లలకోసం విజయాశేషమహల్, విజయామహల్‌లను చిటిక కాలం (ఒక్కనెలలో) నిర్మింపచేసిన ఘనపాటి ఎవరయ్యా అంటే నాగిరెడ్డియనే చెప్పాలి. ఎల్వీప్రసాద్ కుమార్తె పెళ్ళికి, నాగేశ్వరరావు 60 చిత్రాలకూ 'నభూతోనభవిష్యతి' అన్నట్లు ఉత్సవాలు జరిపించాడు. ప్రఖ్యాత తారలతో గాకుండా కొత్తవారిని నటీనటులుగా చేసి, వాళ్ళ స్టార్‌డమ్‌ను పెంచాడు. డి.రామానాయుణ్ణి తనను మించిన వానిగా పరిశ్రమలో ఎదుగుదలకు కూడా నాగిరెడ్డి కారణభూతుడు. ఆంధ్రప్రభుత్వం ఎన్ని భ్రమలు పెట్టినా హైదరాబాద్ వెళ్ళలేదు. అందరూ వెళ్ళినా, నాగిరెడ్డి చెన్నపట్నం నుంచి కదల్లేదు. తిరుమల తిరుపతి దేవస్థానముల అధ్యక్షునిగా ఏడుకొండల రూపాన్నే వైకుంఠంగా మార్చివేసివాడు. అటు తరువాత దేవస్థానానికి అలాంటి అధ్యక్షుడు మరల పుట్టలేదు. మరోటరమ్ వుంటే మానససరోవరం, కైలాసంలా తిరుమల తీరు వేఱుగా ఉండేది. దేవస్థానముతోగల కోట్ల కొద్దీ ఉన్న సొమ్మును జాతీయ బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లను ప్రభుత్వ ట్రజరీల్లో డిపాజిట్ చేయమని ముఖ్యమంత్రిగా ఎన్టీరామారావు హుకుమ్ జారీచేసేసరికి, దాన్ని వ్యతిరేకిస్తూ పదవికి రాజీనామా చేసారు. గుడిలోని సేవలకు ఆయన వెళ్ళినాగానీ, బంధువులు వెళ్ళినాగానీ టిక్కెట్టు తీసుకునేవారు. ఒకసారి ఆయన మిత్రునిగా శ్రీనివాసుని కల్యాణం చేయించే సమయంలో నేను సుప్రభాతసేవకు వెళ్ళడానికి ఆయన పి.ఏ.పట్టాభిరెడ్డి ద్వారా టిక్కెట్లు తీయించి యిచ్చారు. కొండమీద ఉద్యోగుల పిల్లలు చదువుకోడానికి బి.నాగిరెడ్డి కిండర్‌గార్డెన్ పాఠశాల నేర్పాటుచేసారు. తిరుమలలోని ఉద్యానవనాలూ, వైకుంఠం 'క్యూ' కాంప్లెక్సూ ఆయన ఆలోచనయే! తిరుమల క్షేత్రంలోని ఏ ప్రాచీన కట్టడంలోనూ, ఆయన మార్పులు చేయలేదు సరి కదా, అభివృద్ధి పనులే చేసారు. మద్రాసులో తన కార్యాలయంలోని ఉద్యోగులకోసం విజయాహాస్పిటల్‌ని అతికొద్ది కాలంలోనే నిర్మించారు. అలాగే ఆర్కాటు రోడ్‌లో విజయ గార్డెన్స్ ఉన్న చోటును ఊళ్ళనుంచీ వచ్చువారి కోసం విజయా హెల్తు సెంటర్స్ ప్రారంభించారు. రోగులతో వచ్చే వారికి స్టార్‌హోటల్ వసతులుగల గదులను నిర్మించారు. ఆ కట్టడాలను ఆసుపత్రి అంటే ఎవరూ నమ్మరు. నాగిరెడ్డి చేసిన ప్రజోపయోగ కార్యక్రమాలను భారతదేశంలో ఎవరూ చేసి ఉండరు, చేయలేరు. అటువంటి ధీశాలి నాగిరెడ్డి సతీమణి పోయేసరికి వచ్చిన అష్టలక్ష్ములూ ఒక్కటొక్కటిగా తొలిగిపోయాయి. కనుచూపు తగ్గింది. శారీరక రుగ్మత పెరిగింది. 2012 డిసెంబర్ 2కు నిండు నూరేళ్ళు బ్రతకవలసినవాడు 2004 ఫిబ్రవరి 25కు 92 సం॥రాల వయసులోనే నూరేండ్లు నింపుకున్నాడు.

అందరికీ ఆరోగ్య ప్రదానం, తన చిత్రాల ద్వారా ఆనందం పంచిన నాగిరెడ్డి చివరి జీవితం అనారోగ్య చీకాకులు పెట్టింది. ఆరోగ్యం క్షీణించేముందు నన్ను రోజూ సాయంత్రం రమ్మనేవారు. నేను మద్రాసులో లేనందున కడపటి చూపు కూడా దక్కలేదు. ఇమ్మహాత్మునికి 'భారతరత్న' బిరుదుయివ్వాలి. అంత ధర్మమార్గ నిర్దేశికుడెవరున్నారు? ●

## రెండవ తిరుమల చెన్నయ్‌లోని తిరుమల దేవస్థానమందిరం!

తిరుమలలో వేంకటేశ్వరాలయమున కెందరు భక్తులు వచ్చి హుండీని నింపివేస్తారో, ఆ స్థాయిలో చెన్నయ్ త్యాగరాజనగరం వెంకట నారాయణ రోడ్‌లోని టి.టి.డి వారి 'అలిమేలు సమేత శ్రీ వేంకటేశ్వర మందిరం' అంతగానూ జనంతో కిటకిటలాడుతూ హుండీ మొక్కులు చెల్లిస్తూండే భక్తులే ఎక్కువ.

మొదట ఈ మందిరంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారినే ప్రతిష్ఠించారు. అంటే ప్రాణ ప్రతిష్ఠ ఏమీ జరుగలేదు. అప్పుడు మాధవరావుగారనే మేనేజర్ వుండేవారు. సౌజన్యుడు ఎస్.పి.ప్రభాకరరావుగారు మందిర అధ్యక్షపనులతో బాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను చూచేవారు. ప్రక్కన మరో 'శ్రవణం' అను పేరిట హాలులో చిన్న చిన్న ధార్మిక కార్యక్రమాలు జరిపేవారు. ఆ శ్రవణం పైననే శాఖాకార్యాలయాన్నీ, గ్రంధనిలయాన్ని నిర్మించారు. ప్రక్కనే ఉన్న స్థలంలో తిరుమల నుంచి వచ్చే అధికారులకు వసతిగదులను ఏర్పాటు చేసారు.

ఆ స్థాపనా సందర్భ సుముహూర్త విశేషమేమోగానీ, నేను చేసుకున్న తొలి దర్శనంలోనే మేనేజర్ మాధవరావుగారితో ఈ వెంకటేశ్వర మందిరం 'రెండవ తిరుమల'గా వృద్ధి చెందుతుందండీ– అన్నాను. ఆయన నవ్వుతూ ఈ విగ్రహము నకు ప్రాణ ప్రతిష్ఠ జరగలేదండీ– అన్నారు. ఏమో నా కళ్ళకూ తిరుమలపై వెలిసిన ఏడుకొండలవానికీ వ్యత్యాసం తెలియలేదండీ–నా ప్రాణాన్ని నిలిపే మా ఇలవేలుపు తిరుమల వేంకటేశ్వరుడే ఇక్కడ కనిపిస్తున్నాడు. ఆ వేంకటేశ్వరుని ఈ వేంకటవిభుడు ఖ్యాతి ఏడుకొండల మెట్లెక్కినట్టు ఆరోహణ స్థాయిలో ఉంటుందన్నా!

మా సంభాషణల సందర్భ మహిమేమోగాని బంగారువారు, కుమరన్ సిల్కువారు, జి.ఆర్.టి.వారు ఒక్కొక్కరే ఈ స్వామికి ఆభరణాలు చేయించి వేయడం, పట్టువస్త్రాలు బహూకరించడం, విజయాకాస్మెటిక్ సాయినాధ గుప్త ఆలయ నలుగోడల మీద గోవిందనామాలు చెక్కించడం. తిరుమలలోని అవకాశం రా ఇక్కడ. భక్తులు, పళ్ళు, దండలు, తులసిదండలుతో కొల్లకొల్లలుగా రావడం, నివేదనలు చేయడం, వేంకటనారాయణరోడ్డు కిరుప్రక్కలా పూలూపండ్ల అంగడులు, పెద్ద స్థాయిలో హోటళ్ళు, శని ఆదివారం వంటి ప్రత్యేక పర్వదినాల్లో మూడు నాలుగు వీధులవరకూ 'క్యూ' లైన్లు నిలవడం పోలీసుల పర్యవేక్షణం, వేంకటేశ్వరుని సరసనే అలిమేలు మంగ, భూదేవి, వెనకవసారాగోడకానుకుని శ్రీ రంగనాధస్వామి, తిరుమలలో జరిగే ఉత్సవాల్లా హారతులు, నైవేద్యాలు, భోగాలు ప్రతీరోజు బారులు తీరే జనం, నెలకు రెండు మూడు పర్యాయములు హుండీ నిండిపోవడం, తిరుమలనుంచీ అధికారులు, ఇక్కడి ఆంధ్రాబ్యాంకువారు, పరకామణి లెక్కలు పెరిగిపోవడంతో పాలకమండలి పెరిగింది. అసిస్టెంట్లు ఎగ్జిక్యూటివ్ స్థాయి అధికారీ వచ్చారు. నెలలో మొదటి ఆదివారం తిరుపతి లడ్డూ ప్రసాదం విక్రయిస్తున్నారు.



# ఎన్.టి.ఆర్. - ఎ.ఎన్.ఆర్. కలయికకి శుభారంభం పలికిన పల్లెటూరి పిల్ల



తెలుగు సినీ కళామతల్లికి రెండు కళ్లుగా భాసిల్లిన ఎ.ఎన్.ఆర్, ఎన్.టి.ఆర్, కలిసి నటించిన తొలి చిత్రం 'పల్లెటూరి పిల్ల'. ఇది ఎ.ఎన్.ఆర్.కు 12వ చిత్రమయితే, ఎన్.టి.ఆర్‌కి మాత్రం రెండో చిత్రం. అయితే హీరోగా ఎన్టీయార్ నటించిన తొలి సినిమా ఇదే! కాకపోతే ఆయన్ని హీరోగా ప్రేక్షకుల ముందు నిలబెట్టిన మొదటి సినిమా విజయా వారి 'షావుకారు'. ఒకే నెలలో 20 రోజుల తేడాతో ఈ రెండు చిత్రాలు విడుదల కావడం జరిగింది. తను సీనియర్ అయినా టైటిల్స్‌లో ఎన్.టి.ఆర్. పేరు ముందే వస్తే ఆయన కెరీర్‌కు బాగుంటుందని దర్శక నిర్మాత బి.ఎ.సుబ్బారావుకి ఎ.ఎన్.ఆర్. సూచించినా, ఆయన అంగీకరించక టైటిల్స్‌లో ఎ.ఎన్.ఆర్. పేరు ముందు వేశారు. చిత్ర పరిశ్రమలో ఆనాడు నెలకొని ఉన్న ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఇది సూచిస్తుంది. ఎంతోమంది నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ప్రోత్సాహ హస్తాన్ని అందించిన 'పల్లెటూరి పిల్ల' బి.ఎ. సుబ్బారావు చిత్ర విశేషాలు విచిత్రం...

## నాటకాల నుంచి సినిమాలకు

తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడలో పుట్టి పెరిగిన బుగత వెంకట సుబ్బారావుకు చిన్నతనం నుంచి నాటకా లంటే ఎంతో అభిమానం. అందుకే 'నాట్యకళా వినోదిని సభ' పేరుతో ఒక నాటక సంస్థను నెలకొల్పి అనేక ప్రదర్శనలు ఇచ్చేవారు. రైల్వే టిక్కెట్ కలెక్టర్‌గా పనిచేస్తూనే ఆయన ఈ సంస్థను నిర్వహించేవారు. ఈ సంస్థలో అంజలి, ఆదినారాయణరావు, కృష్ణవేణి, ఎస్.వి.రంగారావు, రేలంగి తదితరులు వేషాలు వేస్తుండేవారు. నాటక సంస్థకు అన్నీ తనేగా దిగ్విజయంగా సుబ్బారావు నడిపిస్తున్న తరుణంలో ఆయనకు చిత్రరంగం నుంచి ఆహ్వానం వచ్చింది. ఉద్యోగానికి వీడ్కోలు పలికి 'ఛలో మద్రాస్' అంటూ మద్రాసు చేరు కున్నారు. కొన్ని రోజుల అనంతరం ఆయన మీర్జా పురం రాజావారి శోభనాచల స్టూడియోలో ప్రొడక్షన్ మేనేజర్‌గా చేరారు. జమీందారు అయిన రాజావారు రాజకీయరంగం నుంచి సినిమాలలోకి రావడం జరి గింది. నిర్మాత, దర్శకుడు, స్టూడియో ఓనరు అయిన ఆయన తన జమీందారు పోకడలు మరిచిపోలేదు. తను దర్శకత్వం వహించే చిత్రాల షూటింగులు జరుగుతున్న సమయంలో కూడా ఆయన సెట్ బయట తన వందిమాగధులతో కొలువుతీరేవారు. ఆయన జరగాల్సింది జరిగి తీరుతుందనుకునే ఆశావాది. అటువంటి వ్యక్తి దగ్గర పనిచేస్తూ రాజా వారి గౌరవానికి, మర్యాదలకు లోటు రాకుండా ప్రవర్తిస్తూ ఆయన అభిమానానికి పాత్రుడయ్యారు సుబ్బారావు. రాజావారి మనసు కరిగి 'నువ్వు సినిమా తీస్కో నేను సాయం చేస్తాను' అనే వరాన్ని రాజావారి నుంచి పొంది పూర్ణ మంగరాజు, మరికొంతమంది చేయూ తతో నిర్మాతగా మారి శోభనాచల పతాకంపై 'పల్లెటూరి పిల్ల' చిత్ర నిర్మాణానికి నడుం బిగించారు.




## 'పిజారో' ఆధారంగా...

తన మిత్రుడు ఆదినారాయణరావు, ప్రముఖ రచయిత తాపీ ధర్మారావు నాయుడుల సలహాతో 'పిజారో' అనే నాటకం ఆధారంగా కథను తయారుచేశారు. 'మన దేశం' సినిమాలో విలన్ పాత్రను పోషించిన ఎన్.టి.ఆర్.ని జయంత్ అనే ముఖ్య పాత్ర కోసం, వసంత్ అనే మరో పాత్రకు రఘురామయ్యను, దుష్టుడైన కంపన పాత్రకు ఎస్.వి. రంగారావుని అనుకుని ఆ వివరాలను తన శ్రేయోభిలాషి అయిన ఎల్.వి.ప్రసాద్‌కు చెప్పారు బి.ఎ.సుబ్బారావు. కొత్త సంస్థ, కొత్త దర్శకుడు, కొత్త నటీనటులు కావడంతో ప్రాజెక్ట్ ఇరుకులో పడుతుందేమో చూడు అని ఆయన సలహా ఇచ్చినా సుబ్బారావు పట్టించుకోలేదు. తనమీదున్న నమ్మకంతో ఆయన ముందడుగు వేశారు.

## రఘురామయ్యను మార్చి అక్కినేని

ప్రారంభంలో అంజలీదేవి, రఘురామ య్యల మీద కొన్ని సన్నివేశాలు చిత్రీకరిం చారు. కొన్ని పోరాట సన్నివేశాలలో కూడా రఘురామయ్య పాల్గొనవలసి వచ్చింది. అయితే అవి తనకు సరిపడవని రఘురామయ్య తప్పుకున్నారు. ఆయన తప్పుకోగానే, శోభనాచల సంస్థ నిర్మించిన 'కీలుగుర్రం' సినిమాలో నాయకునిగా నటించిన అక్కినేనిని ఆ పాత్ర పోషించమని అడిగారు. వసంత్ పాత్రను పోషించడానికి అక్కినేని అంగీకరించడంలో ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్.ల కలయికకి నాంది పలికినట్ల యింది. అయితే విలన్ పాత్ర పోషిం చాల్సిన రంగారావు సమయానికి మద్రాసు చేరుకో లేకపోవడంతో, ఆ పాత్రను ఏ.వి. సుబ్బా రావుతో వేయించారు. ఆతర్వాత రంగారావు రావడంతో కంపన్న దొర దగ్గరుండే వృద్ధుడి పాత్ర వేయించారు.

## అంజలీదేవి నాయిక!

ఈ సినిమాలో నాయక పాత్ర పోషించిన అంజలీదేవికి ఆ పాత్ర అగ్నిపరీక్షే అయింది. అంతవరకూ వ్యాంప్ పాత్రలు, దేవకన్యల పాత్రలు పోషించిన ఆమెకు ఇది కొత్త తరహా పాత్ర. ఆమె జంకూ గొంకూ లేకుండా చలాకీగా చేసి, నాయకి పాత్రలు ధరిస్తూ వచ్చి హీరోయిన్ అయిపోయింది. సువర్ణసుందరిగా 'సీత'గా ప్రేక్షక హృదయాల్లో స్థానం సంపా దించింది.'పల్లెటూరి పిల్ల' అఖండ విజయం సాధించింది. సుప్రసిద్ధ స్టూడియో అధినేత ఎస్.ఎస్.వాసన్ ఈ చిత్రాన్ని హిందీలో తీసారు. బి.ఎ. సుబ్బారావు సుప్రసిద్ధ నిర్మాత, దర్శకుడై అనేక మంచి మంచి చిత్రాలు తీసారు. ఆనాటి నిర్మాతలకూ, దర్శకులకూ మంచి చిత్రాలను నిర్మించాలనే అభిరుచి బలంగా ఉండేది. నిర్మాణదశలో ఎన్నో కష్టాలు పడిన సుబ్బారావు శ్రమ ఫలించింది. ●

**2012 వెళ్లిందిలే! ఎందరినో తన పొట్టను పెట్టుకున్నదిలే!**

# శ్రీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

**ఇతరులకు చేసిన మంచి కొంచెమైనా సరే అది అంతర్గత శక్తిని మేల్కొలుపుతుంది.**

- స్వామి వివేకానంద



ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు సాక్ష్యం స్వామి వివేకానంద. ఆ చైతన్య భాస్కరుడి జీవితం మానవజాతికి స్ఫూర్తివంతం. ఆ ఆదర్శ పురుషుడి అడుగుజాడల్లో నడిచే ప్రయత్నం చేద్దాం. మన భరత జాతి గౌరవాన్ని, సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని ఈ విశాల ప్రపంచం అంతటా చాటిన ఆ కారణజన్ముడి 150వ సంవత్సర జన్మదినం సందర్భంగా ఆయన్ను తలచుకుందాం. భారత ప్రభుత్వం ఎంతో గొప్పగా చెయ్యవలసిన సంబరం. ఇక్కడ మతప్రసక్తి అవసరం లేదు. భారతదేశానికి తన సర్వస్వాన్నీ త్యజింపచేసిన మహాయోగి. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ వంటి నేతలంతా స్వామి వివేకానందుని ఆదర్శంగా చేసుకున్నారంటే ఆయనెంతటి మహానుభావుడో అర్థం అవుతుంది. ఇప్పుడున్న రాజకీయ నాయకుల గురించి తెలిసినందునే వివేకానందుడు ఆనాడే ప్రజలు కష్టార్జితంతో విద్యనేర్చి (ఇక్కడ గద్దెనెక్కి అనుకోవచ్చు) వారి గోడు కొంచెమైనా పట్టించుకోనివాడిని ద్రోహి అంటాను. ఎవరి హృదయం పేదల కోసం ద్రవిస్తుందో వారిని మహాత్ముడంటాను" అన్న అక్షర తూణీరాలను రువ్వి స్వామి వివేకానంద నేతలకే నేత అయ్యాడు. మాలాంటి వారి హృదయాలలో ఆయన చక్రవర్తి. కర్మయోగి, యుగాచార్యుడు, మహాభక్తుడైన వివేకానందుని తలుచుకుంటూ ఆయనుకున్న ఆదర్శాలలో ఒకవంతైనా ఆచరిద్దామని కోరుకుందాం. నా ఆశయసిద్ధికి తోడ్పడినవారే నా అనుగ్రహానికి పాత్రులవుతారు. అలా చేయనివారిపై నాకు ఆసక్తి లేదు అని స్వామి చెప్పారు. కాబట్టి కొంతైనా ఆశయంతో జీవిస్తూ ఆయన అనుగ్రహానికి పాత్రులవడానికి ప్రయత్నిద్దాం.

× × ×

చెన్నైలోని తెలుగు బ్రాహ్మణ మహాసభకు నేను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డాను. అదీ అతి పెద్ద మెజారిటీతో. మీరా, బ్రాహ్మణ సమాజమా అంటూ అడిగిన వారున్నారు. నాకు రవ్వంత ఆశ్చర్యం వేసింది. చాలామంది బ్రాహ్మణులు బ్రాహ్మణులని అని చెప్పుకోరు. వాళ్ళకెందుకు అంత నామర్దానో నాకు తెలియదు. అటువంటి వారందరూ ఎదుటి కులం వాడిని గౌరవిస్తూ, మనం మన కులంలో హుందాగా నడుచుకోవడం తెలియనివారేమో అనిపిస్తుంది. భగవద్గీత మొదటి అధ్యాయంలో అర్జునుడు శ్రీకృష్ణుడితో తన భయాన్ని చెపుతూ "కులం నశిస్తే అనాదిగా వస్తున్న శాశ్వతమైన కులధర్మాలన్నీ నశిస్తాయి. ధర్మం నశిస్తే కులాన్నంతనీ అధర్మం తప్పక ఆవరిస్తుంది. కులంలో అధర్మం ఏర్పడితే కుల స్త్రీలు చెడిపోతారు. వర్ణ సంక్రమం ఏర్పడుతుంది. తద్వారా కులాన్ని నశింపచేసినవాళ్ళు – వారి పితృ దేవతలకు పిండం ఇచ్చేవాళ్ళు లేకపోవడంతో పైన వారు పడిపోతారు. ఇకపై నుంచి చూచేవారుండరు, కులవినాశనం అవుతుంది అన్నాడు (మొదటి అధ్యాయం శ్లో 40, 41, 42, 43, 44)

ప్రథమాధ్యాయంలో అర్జునుడలా సందేహాలు వెలిబుచ్చితే తృతియాధ్యాయంలో భగవానుడు శ్రీకృష్ణుడు 35వ శ్లోకంలో **"శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః"** అంటే పరిపూర్ణంగా చక్కగా అనుష్ఠిం చిన పరధర్మం కంటె, ఏవైనా కొన్ని లోపాలున్నా స్వధర్మమే మేలు, స్వధర్మాచరణం కోసం మరణమైనా మంచిదే. పరధర్మం భయానికి హేతువు అన్నాడు గీతాచార్యుడు.

ఇది ఎందరికి అర్థం అయ్యిందో లేదో అర్థమయ్యేవారికి అర్థం అవుతుంది. అదీగాక అన్ని కులాలకి సంఘమున్నట్టు బ్రాహ్మణులకి ఓ సంఘం వుంది. వారి మంచి చెడ్డలు చూడటానికి కట్టుబాట్లు, ఆచారాలు చర్చించుకోవడానికి అంతేకాని అక్కడ వేరే కులాల గురించి మాటలుండవు. కించపరచడాలూ వుండవు. హేళనలు అసలే వుండవు. యక్షుడి ప్రశ్నకు ధర్మరాజు సమాధానమిస్తూ వేదాలను వక్రీకరించే వారు, మత గ్రంథాలను, ద్విజులను, దేవతలనూ తమ వంశీయుల ఆచారాలను నిరసించేవారు నరకానికిపోతారు అన్నాడు. "సర్వేజనా సుఖినో భవంతు" అంటూ సర్వజన సమ్మతంగా, సర్వులను హితులుగా ధర్మానుసారియై, సౌశీల్యంలో వుండడం బ్రాహ్మణత్వాన్ని కలుగచేస్తుంది. కాబట్టి నాకున్న కాస్త తీరిక సమయంలో స్వధర్మ సేవ చేయడానికి ఎన్నుకుని తీసుకున్న బాధ్యతే ఆ తెలుగు బ్రాహ్మణ కార్యదర్శి పదవి. 30 సంవత్సరాల మహాసభ దరిదాపుగా 4000 మంది సభ్యులు కల సభ. వారు నన్ను ఎన్నుకోవడం అన్నది దైవేచ్ఛ. స్వామి వివేకానంద "సక్రమంగా సమాజం కోసం వినియోగపడని మన శరీరం, తెలివితేటలు వుండి లాభం లేదని పదే పదే బోధించేవారు. ఏదో చెయ్యాలన్న ఊహలతో, కలలతో ఆవేశంగా కాకుండా ఏ మంచి పనైనా ప్రణాళికాబద్ధంగా, దీర్ఘకాల ప్రయోజనంగా ఉండాలని ఆశిస్తూ వచ్చిన పదవిని వద్దనకుండా అందుకున్నాను. ముఖ్యంగా తెలుగు బ్రాహ్మణ మహాసభ గత 30 సంవత్సరాలుగా విద్య, వివాహం, సంస్కృతి, సాంప్రదాయాలకు కృషి చేస్తోంది. ఆ దిశగానే నా పయనం వుంటుంది. కులం మీద అభిమానం వుండవచ్చు కాని మిగతా కులాల పట్ల దురభిమానం వుండకూడదు. మన ఆధ్యాత్మికతను మరచిపోయి పాశ్చాత్యుల భౌతిక సుఖాలను ఆలంబనం చేసుకుంటూ నాగరికతను నిర్మించుకుంటున్న కాలంలో, మన సంస్కృతికి గొడ్డలిపెట్టులా మారుతున్న కాలంలో క్రమశిక్షణతో పనిచేయడానికి కలిగిన అవకాశం. సంస్థ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు చెన్నైకే పరిమితం చేయకుండా మిగిలిన చోట్లకు కూడా విస్తరింప చేయాలని సంకల్పించాం. మానవసేవే మాధవసేవయని భావన కలిగిన ధర్మ భూమిలో వున్నందువల్ల నాకు కలిగిన అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని దానికి దైవం తోడుండాలని కోరుకుంటున్నాను. ●



తెలుగు బ్రాహ్మణ మహాసభ ముఖ్య ఉద్దేశాలను శంకరా టీవి ఛానల్ ద్వారా తెలియపరుస్తున్న కార్యదర్శి జీవిరావు ప్రక్కన శంకరన్ అధ్యక్షులు, జయరామన్ కోశాధికారి, పూర్వపు అధ్యక్షులు ఆత్మారామన్ మరియు కార్యవర్గ సభ్యులు